



అమలాపురంలో బాలాత్రిపురసుందరి దేవిగా దర్శనమిచ్చిన శ్రీదేవి అమ్మవారు

గాయత్రి దేవ్యైనమః

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. కోనసీమ జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో అమ్మవార్లు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కొన్నిచోట్ల అమ్మవార్లకు జలాభిషేకం నిర్వహించారు. బాలాత్రిపురసుందరీదేవి, గాయత్రి దేవి అలంకారాల్లో సర్వాంగసుందరంగా అలంకరణ చేశారు.

....8లో



ఆత్రేయపురం మండలం ఉచ్చిలిలో గాయత్రి దేవిగా విజయదుర్గాదేవి



ద్రాక్షారామంలో మాణిక్యాంబ అమ్మవారికి సువర్ణ, రజత పుష్పాలతో అర్చన చేస్తున్న అర్చకస్వామి



అమలాపురంలో గాయత్రి దేవిగా దర్శనమిచ్చిన వాసవికన్యకాపరమేశ్వరి



శివకోటి లాకుల వద్ద అలైన్‌మెంట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

పర్యావరణానికి విఘాతం కలగకుండా...త్వరలో

ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్

అమలాపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి విఘాతం కలగకుండా త్వరలోనే ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్‌ను అందుబాటులోకి తీసుకు రానున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం శివకోడు లాకుల వద్ద జాతీయ రహదారి-216(ఎ) ఎలైన్‌మెంట్ విస్తరణకు సంబంధించి చేపట్టాల్సిన పనులపై స్థానిక అధికారులను ఆరా తీసి రికార్డులను పరిశీలించారు. తూర్పుపాలెంలో ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్ నిర్మాణ పనులను పరిశీలించారు. క్వాయర్ పరిశ్రమలో వివిధ రకాల ఉత్పత్తులైన కోకో, పీట్లు, ఇతర ఉత్పత్తుల ప్యాకింగ్, ఎగుమతి తదితర అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కరవాక నుంచి బోటులో ప్రయాణించి ఆదుర్రు చేరుకున్నారు. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన రిసార్ట్స్ స్థితిగతులను ఆయన పరిశీలించారు. కలెక్టర్ వెంట జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, తహసీల్దారు బి.మృత్యుంజయరావు, డిప్యూటీ తహసీల్దారు ఎంఎస్ రాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదుర్రు బౌద్ధ స్తూపాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

కలెక్టర్ మహేష్‌కుమార్



మామిడికుదురు, అక్టోబరు 4: ఆదుర్రులోని ఆది బౌద్ధస్తూపాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కరవాక రేవు నుంచి గోగన్నమఠం వరకు బోటులో ప్రయాణించి గోదావరి నది మీదుగా ఆదుర్రు బౌద్ధ స్తూపానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెంపుల్ టూరిజం, పర్యాటకం అభివృద్ధిపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. కలెక్టర్ వెంట తహసీల్దారు బి.మృత్యుంజయరావు, అధికారులు ఉన్నారు.



న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రెండో అదనపు జిల్లా జడ్జి నరేష్

మహిళలు రక్షణ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

అమలాపురం టౌన్, అక్టోబరు 4: మహిళల కోసం నిర్దేశించిన రక్షణ చట్టాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని అమలాపురం రెండో అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ అధ్యక్షుడు వి.నరేష్ పేర్కొన్నారు. జాతీయ మహిళా కమిషన్, జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో అమలాపురం మండల సమాఖ్య కార్యాలయంలో మహిళలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ మహిళలపై ఎటువంటి దాడులు, నేరాలు జరగకుండా ముందస్తుగానే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 'విధాన్ సే సమాధాన్' పేరిట న్యాయపరమైన చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మహిళలు పనిచేస్తున్న బహుళ జాతి కంపెనీల్లో పని ఒత్తిడిని తగ్గించుకోవడంతో పాటు శ్రమ దోపిడీని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. న్యాయమూర్తి గౌరీశంకర్, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, రిసోర్సుపర్సన్లు వెంపరాల భాస్కరశాస్త్రి, వి.శ్రీనివాసరావు, ఏపీఎం వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దారు అడపా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



అవార్డు స్వీకరిస్తున్న ఎస్పీ



డీజీపీతో రామచంద్రపురం సర్కిల్ పరిధిలోని పోలీసులు

కోనసీమ జిల్లా ఎస్పీ కృష్ణారావుకు ప్రతిష్టాత్మక ఏబీసీడీ అవార్డు

అందజేసిన డీజీపీ ద్వారకా తిరుమలరావు

అమలాపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అతిక్లిష్టమైన కేసుల్లో అధునాతన విధానాలను అనుసరించి చేధించిన సంఘటనలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఇందులో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు శుక్రవారం ప్రతిష్టాత్మక ఏబీసీడీ అవార్డును అందుకున్నారు. ప్రముఖ కేసును త్వరితగతిన దర్యాప్తు చేసినందుకు ఈ అవార్డును ఆయనకు డీజీపీ ద్వారకా తిరుమలరావు అందించారు. రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలోని రామచంద్రపురం సర్కిల్ పామర్రు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం కేసును అవార్డు ఫర్ బెస్ట్ కేసు డిటెక్షన్‌గా సెలెక్ట్ చేశారు. అప్పటి ఎస్పీ శ్రీధర్ ఈ కేసు దర్యాప్తులో అత్యున్నత ప్రమాణాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరస్తులను గుర్తించి అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టి చట్ట ప్రకారం శిక్షపడేలా చేశారు. ఈ కేసుకు సంబంధించి ఫర్ బెస్ట్ కేసు డిటెక్షన్ అవార్డును, క్యాష్ రివార్డును కోనసీమ జిల్లా ప్రస్తుత ఎస్పీ బి.కృష్ణారావు, రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, పామర్రు ఎస్‌కే జానీబాషా, డాగ్ హ్యాండ్లర్స్ నాగరాజు, స్పైడర్‌లకు డీజీపీ ద్వారకా తిరుమలరావు శుక్రవారం అందజేశారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణను

కచ్చితత్వంతో నిర్వహించాలి

29 నాటికి ముసాయిదా జాబితా ప్రచురించాలి: కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025 రూపకల్పనలో అన్ని ప్రక్రియలను సమర్థవంతంగా చేపట్టి కచ్చితత్వంతో కూడిన జాబితాను రూపొందించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల నమోదు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయా నియోజకవర్గాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి ఇంటింటా సర్వే, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, 1,500 మంది ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాల వివరాలపై సమీక్షించారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితా తయారీ అంశాలపై ఆరా తీశారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్‌యాదవ్ ఆదేశాల మేరకు నిర్దేశిత గడువు నాటికి ముసాయిదా, తుది జాబితాలను ప్రచురించాలన్నారు. ఈ నెల 29 నాటికి ముసాయిదా జాబితాను ప్రచురించి నవంబరు 28 వరకు అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. నవంబరు 9, 10, 23, 24 తేదీల్లో ప్రత్యేక క్యాంపెయిన్లు నిర్వహించి దరఖాస్తులను బీఎల్వోలు స్వీకరించాలన్నారు. డిసెంబరు 24న అభ్యంతరాలను పరిష్కరించాలన్నారు. 2025 జనవరి 6వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురించాలన్నారు. జిల్లాలో 1,644 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, పట్టణ ప్రాంతాల్లో 148, గ్రామీణ ప్రాంతాల్లో 1,496 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్టు వివరించారు. ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు కళాశాలల్లో 'స్వీప్' యాక్టివిటీస్ నిర్వహించి 18-19 సంవత్సరాలు గల విద్యార్థులను ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి యిళ్ల వెంకటేశ్వరరావు పదవీ కాలం 2025 మార్చి 29 నాటికి ముగుస్తుందన్నారు. ఇప్పటికే పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియకు ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. నవంబరు 6 వరకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ముసాయిదా జాబితాలను నవంబరు 23న ప్రచురించి డిసెంబరు 9 వరకు అభ్యంతరాలు స్వీకరించాలన్నారు. డిసెంబరు 30న పట్టభద్రుల ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ఎన్నికల అధికారులు వీవీవీఎస్ లక్ష్మణరావు, డాక్టర్ వి.శివశంకరప్రసాద్, ఎం.ఝాన్సీరాణి, కె.మాధవి, శ్రీకర్, ఎస్.సుధాసాగర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

దోషరహిత ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి

ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు దోషరహిత ఓటర్ల జాబితా తయారీలో సహకరించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. 18 ఏళ్లు నిండి ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలన్నారు. శిథిలస్థితికి చేరిన పోలింగ్ కేంద్రాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పట్టణంలో ఉంటూ ప్రస్తుతం టిడ్కో గృహాల్లో నివసిస్తున్న వారిని స్థానిక ఓటరుగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఉపాధ్యాయ ఓటర్ల నమోదు విషయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సూచనలను పరిగణలోకి తీసుకుని తగు చర్యలు తీసుకుంటామన్నారు. దూరి రాజేష్ (బీజేపీ), వడ్డి నాగేశ్వరరావు (కాంగ్రెస్), కారెం వెంకటేశ్వరరావు (సీపీఎం), వై.జగన్మోహన్, కె.శ్రీనివాసరావు (టీడీపీ) పాల్గొన్నారు.

అప్పనపల్లికి పూర్వవైభవం తీసుకొస్తా

సహాయ కమిషనరు సత్యనారాయణరాజు



మామిడికుదురు, అక్టోబరు 4: అప్పనపల్లి బాలబాలాజీస్వామి దేవస్థానానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని సహాయ కమిషనరుగా నియమితులైన ఎం.సత్యనారాయణరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. దేవస్థానం సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి అందరూ సమిష్టి కృషి చేద్దామన్నారు.



7 నుంచి తపాలా వారోత్సవాలు

పోస్టల్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్

అమలాపురం టౌన్, అక్టోబరు 4: అమలాపురం డివిజన్‌లో ఈ నెల 7వ తేదీ నుంచి తపాలా వారోత్సవాలు నిర్వహించనున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్ తెలిపారు. తపాలా శాఖ 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఐదు రోజులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 150 ఇయర్స్ ఆఫ్ ఎనేబిలింగ్ కమ్యూనికేషన్ అండ్ ఎంపవరింగ్ పీపుల్స్ ఎక్రాస్ నేషన్స్ అనే థీమ్‌తో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 7న మెయిల్స్ అండ్ పార్సిల్స్ దినోత్సవం, పోస్టుమెన్, డెలివరీ సిబ్బందితో కస్టమర్ మీట్ నిర్వహిస్తారు. 8న ఫిలాటెలీ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు, ఖాతాదారులకు స్టాంపుల సేకరణపై అవగాహన కల్పిస్తారు. 9న ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఫిట్ పోస్ట్.. ఫిట్ ఇండియా' స్లోగన్‌తో ర్యాలీ నిర్వహిస్తారు. 10న అంత్యోదయ దివస్, 11న తపాలా సేవింగ్స్ బ్యాంకు, ఇండియా పోస్టుపేమెంట్ బ్యాంకు అందించే సేవలపై ఖాతాదారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. నిలిచిపోయిన పాలసీలను పునరుద్ధరించడం, కొత్త పాలసీల సేకరణ, పెండింగులో ఉన్న క్లయిమ్‌లను పరిష్కరిస్తామని పోస్టల్ ఎస్పీ నవీన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.శ్రీధరం, తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు.



వరద బాధితులకు 'విద్యానిధి' రూ.5.51 లక్షల విరాళం

అమలాపురం టౌన్, అక్టోబరు 4: విజయవాడ వరద బాధితులకు అమలాపురం విద్యానిధి విద్యా సంస్థల తరపున రూ.5,51,232 విరాళం చెక్కును చైర్మన్ ఆకుల బాపన్న నాయుడు ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు.



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయానికి ఐఎస్‌వో ధ్రువీకరణ

ఐ.పోలవరం, అక్టోబరు 4: మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయానికి ఐఎస్‌వో ధ్రువీకరణ లభించిందని దేవస్థానం సహాయ కమిషనరు మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ఆలయంలో జరిగే అన్నదాన నాణ్యతను గుర్తిస్తూ ఐసీఎవో సంస్థ రెండు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసింది. వీటిని ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ, పర్యవేక్షణాధికారి కటారి శ్రీనివాసరాజు అందుకున్నారు. సహాయ కమిషనరును ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అభినందించారు.

నైపుణ్యత మెరుగు దిశగా విద్యాబోధన సాగాలి

- హోంమంత్రి వంగలపూడి అనిత
- ముగిసిన అంతర్ రాష్ట్ర బాలికల కబడ్డీ, వాలీబాల్ చాంపియన్‌షిప్


హోంమంత్రి అనితను సన్మానిస్తున్న శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అధినేత నరసింహారావు



ఎంపికైన విద్యార్థులతో హోంమంత్రి అనిత

తుని రూరల్, అక్టోబరు 4: విద్యార్థుల నైపుణ్యత మెరుగుపరిచే దిశగా విద్యాబోధన సాగాలని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో జరిగిన క్లస్టర్-1 అంతరాష్ట్ర బాలికల కబడ్డీ, వాలీబాల్ చాంపియన్‌షిప్ ముగింపు వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మూడురోజులుగా జరిగిన ఈ పోటీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలనుంచి 100కు పైగా పాఠశాలల నుంచి 1200మంది పైబడి క్రీడాకారులు పాల్గొని క్రీడాస్ఫూర్తి చాటారు. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడారు. విద్యార్థులు చదివితేనే తెలివైన వారు కాదని, చదవకుంటే తెలివి తక్కువవారు కాదని, ఏ రంగంలో రాణించినా తెలివైన వారని ఆమె తెలిపారు. ఆడపిల్లలు తలవంచుకునేలా కాకుండా అన్యాయం జరిగినప్పుడు తిరగబడేలా ఉండాలన్నారు. క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయని ఆ దిశగా శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలు ముందుకు సాగడం అభినందనీయమన్నారు. చదువు, క్రమశిక్షణ, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు సంస్థాగత నైపుణ్యాలు నేర్పే విద్యాలయాల్లో శ్రీ ప్రకాష్ ముందుంటుందని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. గౌరవఅతిథిగా విచ్చేసిన రిటైర్డ్ జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎన్.సూర్యారావు మాట్లాడుతూ చదువులతోపాటు క్రీడలకు విద్యాసంస్థలు ఇస్తున్న ప్రాధాన్యంవల్లే ప్రతిష్టాత్మక రాష్ట్రస్థాయి పోటీలు ఈ ఏడాది శ్రీప్రకాష్‌లో జరగడానికి కారణమన్నారు. విద్యాసంస్థల కార్యదర్శి సీహెచ్ విజయప్రకాష్ మాట్లాడుతూ గెలుపు, ఓటములను సమాన దృష్టిలో చూసే ఆలోచనా దృక్పథం విద్యార్థులు అలవరుచుకునేందుకు ఆటలు దోహదపడతాయని, పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు మంచి ప్రతిభను కనబరిచారని తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులు జాతీయస్థాయికి అర్హత పొందుతారన్నారు. అనంతరం విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, హోంమంత్రి అనితను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. గెలుపొందిన వారికి మెడల్స్ జ్ఞాపికను అందజేశారు. పాఠశాలల నుంచి విద్యార్థులు, కోచ్‌లు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

విజేతలు వీరే..

మూడురోజులపాటు హోరాహోరీగా జరిగిన అంతర్ రాష్ట్ర బాలికల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-14 కబడ్డీ విభాగంలో అనకాపల్లి జిల్లాకు చెందిన పాయకరావుపేటలోని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ కబడ్డీలో ప్రథమస్థానంలో నిలిచింది. తెలంగాణాలోని భువనగిరికిచెందిన న్యూడైమెన్షన్ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయస్థానంలో నిలిచారు.

- అండర్-17 కబడ్డీ విభాగంలో కృష్ణా జిల్లా నరసింగపాలెం, హిల్ స్కూల్ ప్రథమస్థానం, తెలంగాణ మేడ్చల్ జిల్లా కొండపూరా ప్రబోధానంద ప్రశాంతినికేతన్ స్కూల్ ద్వితీయ బహుమతి సాధించాయి.
- అండర్-19 కబడ్డీ పోటీల్లో ఖమ్మం జిల్లా ఖమ్మంకు చెందిన హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ ప్రథమ స్థానం, హైదరాబాద్ ది హార్ట్‌ఫుల్ లెర్నింగ్ సెంటర్ స్కూల్ ద్వితీయస్థానం సాధించాయి.
- వాలీబాల్ అండర్-14 విభాగంలో మేడ్చల్ జిల్లా కూకట్‌పల్లి నిజాంపేట సంఘ మిత్ర స్కూల్ ప్రథమ బహుమతి, మేడ్చల్ జిల్లా కూకట్‌పల్లి డీఏవీ పబ్లిక్ స్కూల్ ద్వితీయ బహుమతి సాధించాయి.
- వాలీబాల్ అండర్-17 విభాగంలో నెల్లూరుకు చెందిన నవనీత పబ్లిక్ స్కూల్ ప్రథమ బహుమతి, అనంతపురం మాంటిస్సోరి ఎలైట్ స్కూల్ ద్వితీయ బహుమతి సాధించాయి.
- వాలీబాల్ అండర్-19 విభాగంలో మేడ్చల్ నాచారం డీపీఎస్ స్కూల్ ప్రథమ బహుమతి, నెల్లూరు అక్షరవిద్యాలయం ద్వితీయ బహుమతి సాధించాయి.

గాయత్రీదేవిగా మాణిక్యాంబ అమ్మవారు

- రెండో రోజు శరన్నవరాత్రి ఉత్సవాలు


గాయత్రీదేవి అవతారంలో మాణిక్యాంబ అమ్మవారు

ద్రాక్షారామ, అక్టోబరు 4: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో రెండోరోజు శుక్రవారం ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ద్వాదశశక్తి పీఠం మాణిక్యాంబ అమ్మవారు వేదమాత గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మాణిక్యాంబ సన్నిధిలో విశేష కుంకుమార్చనలు, శ్రీచక్రనవావర్ణార్చన, సాయంత్రం లక్ష కుంకుమార్చన, సువర్ణ, రజత పుష్పార్చనలు జరిగాయి. మంత్రి వాసంశెట్టి సుభాష్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

జాతీయ యోగా పోటీల్లో రోహిణికి కాంస్యం


కానిస్టేబుల్ రోహిణిని అభినందిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలోని సైబర్ ల్యాబ్‌లో మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆర్.రోహిణి జాతీయస్థాయిలో నిర్వహించిన యోగా పోటీల్లో రెండోసారి కాంస్య పతకం సాధించారు. ఛత్తీస్‌గఢ్‌లోని బిలాయ్‌లో ఆలిండియా పోలీసు క్లస్టర్ ఛాంపియన్ షిప్ 2024-25 పేరుతో ఈపోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహకిషోర్ ఆమెను అభినందించారు. జాతీయ స్థాయిలో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) అల్లూరి వెంకట సుబ్బరాజు పాల్గొన్నారు.


ప్రవచిస్తున్న స్వామి పరిపూర్ణానంద సరస్వతి, కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

శ్రీపీఠంలో ఆధ్యాత్మిక శోభ

- మహాశక్తి యాగంలో పాల్గొన్న వేలాది మంది భక్తులు
- దుర్గాదేవి రూపంలో దర్శనమిచ్చిన ఐశ్వర్యాంబికా దేవి

సర్పవరం జంక్షన్, అక్టోబరు 4 : దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా కాకినాడ శ్రీపీఠం గోశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న మహాశక్తి యాగం-2024లో వేలాది మాతృమూర్తుల మధ్య భక్తిశ్రద్ధలతో వైభవోపేతంగా సాగుతోంది. శ్రీపీఠం నిర్వాహకులు స్వామీ పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో శుక్రవారం ఐశ్వర్యాంబిక అమ్మవారిని దుర్గాదేవి రూపంలో అలంకరణచేసి దుర్గా సూక్త, ప్రత్యంగిరా హోమం ఘనంగా నిర్వహించారు. శతకోటి కుంకుమార్చన, లలిత పారాయణం చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ భక్తులను ఉద్దేశించి అనుగ్రహ పారాయణం చేశారు. శతకోటి కుంకుమార్చన మహాక్రతువులో రెండు రోజుల్లో 16 కోట్ల కుంకుమార్చన మంత్రోచ్చరణ జరిగిందని, పదిరోజుల్లో 100 కోట్లకుపైగా చేరుకుంటుందన్నారు. మహాశక్తియాగంలో వేలాది మాతృమూర్తులు గొప్ప సంకల్పంతో ఎరుపు దీక్షా వస్త్రాలు ధరించి ఐశ్వర్యాంబిక అమ్మవారు రూపంలో ఈ క్రతువులో పాల్గొంటున్నారని, ఇదంతా అమ్మ అనుగ్రహమేనన్నారు. ఆయోధ్యకు తీసుకెళ్లేందుకు వెళుతోన్న శ్రీరాముని చేతిలో ఉండే వెండి ధనస్సు, బంగారు బాణం శ్రీపీఠానికి శనివారం భక్తుల సందర్శనార్థం వస్తున్నాయని, వీటికి ప్రత్యేకంగా సంకల్ప సిద్ధి అనంతరం అయోధ్యకు నిర్వాహకులు తీసుకెళతారన్నారు.శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఈనెల 9వ తేదీన 24 వేల మంది విద్యార్థులతో ఒకేప్రాంగణంలో 3 కోట్ల త్రికోటి మహా సరస్వతీ పూజా కార్యక్రమాన్ని చేపట్టనున్నామన్నారు. సాయంత్రం పవిత్ర లక్షార్చన కార్యక్రమంలో భాగంగా భక్తులు తీసుకొచ్చిన లక్ష పసుపు కొమ్ములతో పసుపు పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత కచేరి, కేరళ డప్పు కళాకారులు చేసిన ప్రదర్శన భక్తులను మైమరపించాయి. ఏపీ, తెలంగాణా, బెంగళూరు తదితర రాష్ట్రాల నుంచి సుమారు 30 వేల మంది భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


దుర్గాదేవిగా దర్శనమిచ్చిన ఐశ్వర్యాంబికా

ఘనంగా దేవీచౌక్ శరన్నవరాత్రి మహోత్సవాలు


రాజమహేంద్రవరంలో దేవీచౌక్ వద్ద అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 4: రాజమహేంద్రవరం దేవీచౌక్‌లోని బాలత్రిపుర సుందరీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం కుంకుమ పూజలు నిర్వహించారు. రెండో రోజు అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం కావడంతో భక్తులు ఉదయం నుంచి రాత్రి 10గంటలకు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారికి మంగళవాయిద్యాలతో అఖండ హారతిని ఇచ్చారు. అమ్మవారిని రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకున్నారు.

సినీ నిర్మాత దామిశెట్టి మృతి


నళినీరంజనరావు

ద్రాక్షారామ, అక్టోబరు 4: సినీ నిర్మాత, నీటి వినియోగదారుల సంఘం మాజీ అధ్యక్షుడు దామిశెట్టి నళినీ రంజనరావు(85) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పదహారేళ్ల వయస్సు, పల్లెటూరి మొనగాడు చిత్రాల నిర్మాతల్లో నళినీరంజనరావు ఒకరు. పదహారేళ్ల వయస్సు సినిమా అప్పట్లో ఘనవిజయం సాధించింది. పదహారేళ్ల వయస్సు సినిమా ద్రాక్షారామ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ చేశారు.

వ్యాన్ ఢీకొని బీటెక్ విద్యార్థిని మృతి

- మరో యువతికి గాయాలు
- బూరుగుపూడి వద్ద ఘటన


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకట దీప్తి

కోరుకొండ, అక్టోబరు 4: తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బూరుగుపూడిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థిని మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. నిడదవోలు మండలం పురుషోత్తపల్లికి చెందిన జుజ్జవరపు వెంకటదీప్తి(18), ఆమె స్నేహితురాలు మేకల అనూష కాకినాడజిల్లా సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు.ఇద్దరూ రాజమహేంద్రవరం నుంచి కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ దర్శనానికి స్కూటీపై వస్తుండగా కోరుకొండ నుంచి రాజమహేంద్రవరంవైపు వెళుతున్న టాటా ఏస్ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో దీప్తి తలకు బలమైన గాయం కావడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందగా అనూషకు మణికట్టు వద్ద విరిగి గాయమైనట్టు ఎస్ఐ శ్యామసుందర్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కొవ్వూరు లిటరరీ క్లబ్‌లో పేకాట శిబిరంపై పోలీసుల దాడి

- మొదటి అంతస్తు నుంచి పడిపోయిన ఇద్దరికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం


గాయపడిన పంతం సత్తిబాబు

కొవ్వూరు, అక్టోబరు 4 : తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు లిటరరీ క్లబ్‌లో పోలీసులు జరిపిన దాడిలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా మారింది. కొవ్వూరు లిటరరీ క్లబ్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం నుంచి వచ్చిన ప్రత్యేక పోలీసు బృందం దాడి చేసింది. ఈదాడిలో 30మంది పారిపోగా, ఇద్దరిని అదుపులోకి తీసుకుని రూ.5,800 నగదు, కొన్ని కాయిన్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. క్లబ్‌లో రమ్మీ పేకాట ఆడుతున్న సందర్భంలో పోలీసులు పేకాటరాయుళ్లపై దుర్భాషలాడుతూ భయభ్రాంతులకు గురిచేసినట్టు క్లబ్ నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. కాగా ఈ దాడిలో ఇరువురు వ్యక్తులు భవనం మొదటి అంతస్తు నుంచి కిందకు పడిపోయారు. వీరిలో కాకినాడకు చెందిన పంతం సత్తిబాబు తలకు తీవ్ర రక్తగాయమై చెవి నుంచి రక్తం కారింది. వెంటనే ఈయనను రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అలాగే కొవ్వూరుకు చెందిన కాగిత సుభాష్ చంద్రబోస్‌కు కాలు విరిగింది. సుభాష్ చంద్రబోస్ కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలిసిన వెంటనే టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు క్లబ్ చేరుకున్నారు. హైకోర్టు ఆర్డర్ ప్రకారం సీసీ కెమెరాల పర్యవేక్షణలో కాలక్షేపం కోసం జరుగుతున్న ఈ వ్యవహారంపై జిల్లా ఎస్పీ, పోలీసులు వ్యవహరించిన తీరుపై ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, హోంమంత్రి వంగలపూడి అనితలకు వీరు ఫిర్యాదుచేశారు.

లక్ష్మీదేవిగా రత్నగిరి దుర్గలు


లక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన రత్నగిరి దుర్గలు

అన్నవరం, అక్టోబరు 4: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రత్నగిరి క్షేత్ర రక్షకిలుగా పూజలందుకుంటున్న వనదుర్గ, కనకదుర్గలు రెండో రోజైన శుక్రవారం లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అష్టైశ్వర్యాలను ప్రసాదించే దేవతగా అమ్మవారిని అలంకరించగా భక్తులు అమ్మవారిని దర్శించి తరించారు. ఆలయంలో ప్రత్యేకపూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు.


కనకదుర్గమ్మకు స్వర్ణ కిరీటం అలంకరణ


అమ్మవారికి అలంకరించిన నవరత్న ఖచిత స్వర్ణకిరీటం

గోకవరం, అక్టోబరు 4: తూర్పుగోదావరిజిల్లా గోకవరంలోని దేవీచౌక్ సెంటర్‌లో శ్రీకనకదుర్గమ్మకు నవరత్న ఖచిత బంగారు స్వర్ణ కిరీటం అలంకరణ శుక్రవారం వైభవంగా జరిగింది. భక్తులు, విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు సహకారంతో సమకూర్చిన, రూ.21లక్షల విలువైన 250గ్రాముల బంగారంతో తయారు చేసిన ఈ స్వర్ణ కిరీటాన్ని శరన్నవరాత్రి మహోత్సవాలు రెండోరోజున అమ్మవారికి అలంకరించారు. ముందుగా శ్రీనివాసరావు, గంగారత్నం దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. వచ్చే ఏడాది అమ్మవారికి రూ.70లక్షల వ్యయంతో బంగారు చీర తయారు చేయించేందుకు సంకల్పించినట్లు శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 50 గ్రామాల నుంచి భక్తులు హాజరైనట్టు ఆలయ కమిటీ తెలిపింది.

రోడ్డు ప్రమాదంలో మండపేట వాసి మృతి

- అవయవదానం చేసిన కుటుంబ సభ్యులు
- గ్రీన్‌చానల్ ద్వారా విశాఖకు తరలింపు


రెడ్డి కళ్యాణ చక్రవర్తి(ఫైల్)

మండపేట, అక్టోబరు4: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణానికి చెందిన రెడ్డి కళ్యాణచక్రవరి (53) ఈనెల 2న మండపేట నుంచి రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి మండపేటకు వస్తుం డగా రాజనగరం మండలం తుంగపాడు వద్ద రోడ్డు గోతులో పడి ప్రమాదానికి గురై తలకు తీవ్రగాయమైంది. ఆయనకు మెరుగైన వైద్యం కోసం ఆయన కుటుంబ సభ్యులు కాకినాడలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్సకోసం హుటాహుటిన తరలించారు. అక్కడ వైద్యపరీక్షలు చేసిన వైద్యులు రెండోరోజు చక్రవర్తికి బ్రెయిన్‌డెడ్ అయిందని నిర్ధారించారు. చక్రవర్తికి భార్య, ఇద్దరు కూమార్తెలు ఉన్నారు. కుటుంసభ్యులకు అవయవదానం గురించి తెలుసుకుని ఆయన అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారు. వారి అంగీకారం మేరకు వైద్యులు చక్రవర్తికి ఆపరేషన్ చేసి అవయవాలను ప్రత్యేక వాహనంలో గ్రీన్‌చానల్ ద్వారా విశాఖకు శుక్రవారం తరలించారు. మరణించి కూడా మరికొంతమంది జీవితాల్లో వెలుగులు నింపిన చక్రవర్తి మరణించినా కూడా చిరంజీవిగానే మిగి లాడని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. పుట్టెడుబాధలో కూడా కుటుంబ సభ్యులు పెద్దమనస్సుతో అవయవదానం చేయటం పట్ల వారి ఉదారతను పట్టణ ప్రజలు ప్రశంసించారు. చక్రవర్తి అవయవదానం అనంతరం శుక్రవారం మండపేటకు తీసుకువచ్చి కుటుంబసభ్యులు బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు.

మృత్యువులోనూ వీడని పేగుబంధం

- కుమారుడి మరణవార్తతో కన్నతల్లి గుండె ఆగింది
- అంబాజీపేటలో విషాదఛాయలు
- ఒకేసారి అంత్యక్రియలు...


అంబాజీపేటలో తల్లి, కొడుకుల మృతదేహాలు

అంబాజీపేట, అక్టోబరు 4: మృత్యువులోనూ పేగుబంధం వీడలేదు. కుమారుడు మరణవార్తతో కన్నతల్లి గుండె బద్దలైంది. ఒకేరోజు ఇద్దరి మృతితో ఆ ఇంట తీవ్ర విషాదం చోటుచేసుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా అంబాజీపేటకు చెందిన మద్దింశెట్టి ఆదిబాబు(46) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కొడుకు మరణవార్త విని తట్టుకోలేని ఆ తల్లి గుండె ఒక్కసారిగా బరువెక్కింది. దీంతో తల్లి మద్దింశెట్టి మహాలక్ష్మి(72) ఒక్కసారిగా కుప్పకూలిపోగా స్థానికులు వెంటనే ఆమెను హుటాహుటిన అంబులెన్స్‌లో ఆమెను ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మార్గమధ్యంలో మృతిచెందారు. మహాలక్ష్మికి నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇద్దరు కుమారులు గతంలోనే మృతి చెందగా, ఒక కుమారుడు తప్పిపోయాడు. ఇప్పుడు మిగిలిన కుమారుడు ఆదిబాబు మృతి చెందడంతో ఆమె తట్టుకోలేక గుండెపోటుతో మృతి చెందింది. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామస్థులు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదిబాబు గతంలో చిరంజీవి అభిమాన సంఘం అధ్యక్షుడిగా, అయ్యప్ప గురుస్వామిగా, ఇందుపల్లి ఏ-1 కన్వెన్షన్ హాలు మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన భార్య మద్దింశెట్టి లక్ష్మీ పార్వతీదేవి మాచవరం 4వ వార్డు సభ్యురాలిగా పనిచేస్తున్నారు. ఆదిబాబు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. అనంతరం ఇద్దరు భౌతికకాయాలను అంతిమయాత్ర నిర్వహించి ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి

- పోలవరం నిర్వాసితుల గృహాలు పరిశీలించిన ప్రాజెక్టు సీఈవో

దేవీపట్నం, అక్టోబరు 4: పోలవరం ముంపునకు గురై నిరాశ్రయులైన దేవీపట్నం, పూడిపల్లికి చెందిన గిరిజనేతరుల కోసం గోకవరంలో నిర్మిస్తున్న గృహ సముదాయాలను శుక్రవారం పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు సీఈవో అతుల్ జైన్ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా సీఈవో అతుల్‌జైన్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురై నిర్వాసితులుగా మారిన గిరిజనేతరులకు ఎటువంటి నష్టం లేకుండా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ద్వారా ప్రస్తుతం 770 ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ, సీఈ రాజేష్‌కుమార్, కార్యదర్శి యం.రఘురాం, డీడీఎం రవి, డీడీడీఎస్ ప్రసాద్, తహసీల్దార్ రామకృష్ణ ఉన్నారు.

సీఈవోను అడ్డుకున్న పోలవరం నిర్వాసితులు

గోకవరం గంగాలమ్మతల్లి సమీపంలో దేవీపట్నం, పూడిపల్లి గ్రామాల ప్రజలకు నిర్మిస్తున్న గృహాలను సందర్శించేందుకు వచ్చిన ప్రాజెక్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను గోకవరం ప్రధాన రహదారిపై పూడిపల్లి గ్రామ నిర్వాసితులు అడ్డుకున్నారు. నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ కాలనీ నిర్మాణం పూర్తికాలేదని బయట ఇళ్లల్లో అద్దెకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని అర్హులైన వారిని జాబితాలో చేర్చకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. తక్షణమే ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ నిర్వాసితులు సుమారు అరగంటసేపు రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు రంగప్రవేశం చేసి నిర్వాసితులకు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. దీంతో సీఈవో కారు ముందుకు కదిలింది.


అధికారులతో మాట్లాడుతున్న సీఈవో అతుల్‌జైన్

అన్నపూర్ణ అలంకారంలో..



సామర్లకోట: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో బాలా త్రిపు రసుందరి అమ్మవారికి ఆలయ పండితులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని చిత్తానక్షత్రమందు అన్నపూర్ణ అమ్మవారిగా సర్వాంగ సుందరంగా అలంకరించారు నిత్యాన్నదాన పథకంలో 400 మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ప్రాణాలు తీసిన ఈత

- ఆడుకోవడానికని వెళ్లి.. అనంతలోకాలకు..
- పంట కాలువలోకి ఈతకోసం దిగి ఇద్దరు విద్యార్థుల మృతి
- కాకినాడ రూరల్ తూరంగిలో విషాదఛాయలు


ఆసుపత్రిలో మృతుడు జక్కి అభిరామ్


గండికోట దుర్గాప్రసాద్

కాకినాడరూరల్, అక్టోబరు 4: ఆడుకోవడానికని ఆ బాలలు ఇంటి నుంచి బయటికి వెళ్లారు.. స్నానం చేద్దామని.. ఈత కొడదామనుకుని పంట కాలువలోకి దిగారు.. లోపల బురద ఎక్కువగా ఉండడంతో ఇరుక్కుపోయారు.. మొత్తం నలుగురు కాలువలోకి దిగగా ఇద్దరు చిన్నారులు పంట ఊబిలో కూరుకుపోయి మరణించారు. ఈ విషాదకర సంఘటన కాకినాడజిల్లా కాకినాడరూరల్ మండ లం తూరంగిలో శుక్రవారం జరిగింది. ఆడుకోవడానికి వెళ్లి వస్తానని చెప్పిన కుమారులు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆ తల్లిదండ్రుల రోధన వర్ణనాతీతంగా ఉంది.

ఈత కొడదామని దిగి..

ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ రూరల్ మండ లం తూరంగి ఉప్పరపేటకు చెంది న చిన్నారులు జక్కి అభిరామ్(8) (2వ తరగతి), గండికోట దుర్గాప్రసాద్(10)(3వ తరగతి), వెంకన్న, కిరణ్ అనే నలుగురు విద్యార్థులు స్థానికంగా ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. దస రా సెలవులు కావడంతో శుక్రవారం మ ధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంటి నుంచి బయటకు ఆడుకోవడానికి వెళ్లారు. దగ్గరలోని అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో రామాలయం వెనుక ఉన్న పంట కాలువ వద్దకు వెళ్లారు. నలుగురూ కలిసి స్నానం చేస్తూ ఈత కొడదామని ఆ కాలువలోకి దిగారు. కాలువలో బురద ఎక్కువగా ఉండ డంతో అందులో అభిరామ్, దుర్గాప్రసాద్ ఇద్దరూ కూరుకుపోయారు. బయటకు రాలేని పరిస్థితుల్లో హాహాకారాలు చేస్తున్నారు. దీంతో భయపడిన మిగతా ఇద్దరు చిన్నారులు వెంకన్న, కిరణ్ వెంటనే పరుగు పరుగున ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో విషయం చెప్పారు. వెంటనే తల్లిదండ్రులు, స్థానికు లు అక్కడికి చేరుకుని ఇద్దరినీ బయటకు తీశారు. వారిలో దుర్గాప్రసాద్ అప్పటికే మృతి చెందగా కొన ఊపిరితో ఉన్న అభిరామ్‌ను కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో ఇద్దరు విద్యార్థులు క్షేమంగా ఉన్నారని ఎస్ఐ తెలిపారు. మృతుడు అభిరామ్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మార్చురీకి తరలించామని తెలిపారు.

పిల్లల్ని పర్యవేక్షించాలి: ఎస్ఐ

దసరా సెలవులు కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పర్యవేక్షిస్తుండాలని, ముఖ్యంగా కాలువలు, సముద్రం, నూతుల వద్దకు పంపించవద్దని ఎస్ఐ వీరబాబు తల్లిదండ్రులకు సూచించారు.

హత్య కేసు దర్యాప్తు

ముమ్మిడివరం, అక్టోబరు4: అనాతవరం భోగాలవారితోట సమీపంలో జరిగిన హత్య కేసును అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ దర్యాప్తు నిర్వహించారు. 2022సెప్టెంబరు 22న భోగాలతోటకు చెందిన పెదపూడి రవి కుమార్(32) హత్యకు గురైన విషయం విదితమే. అప్పటి సీఐ ఎం.జానకీ రామ్ ఆధ్వర్యంలో అప్పటి ఎస్ఐ కేసు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం డీఎస్పీ ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి స్థానికులను విచారించారు. ఆయన వెంట సీఐ మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఉన్నారు.

వివిధ రూపాల్లో కనకదుర్గమ్మ దర్శనం



మండపేట ఏడిదరోడ్డులో పెద్దమ్మతల్లి, రాయవరం (వెదురుపాక) అమ్మవారు, యానాం బాలాత్రిపుర సుందరిగా పాలకనకదుర్గమ్మ, అన్నపూర్ణగా ఆలమూరు రావులమ్మ

అమలాపురం టౌన్, అక్టోబరు 4: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా పట్టణంలోని శ్రీబాలాత్రిపురసుందరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో 200మంది మహిళలు కోటి కుంకుమార్చనను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణ జరిపారు. కూచిమంచి చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు కూచిమంచి మల్లపురాజు, కూచిమంచి శశిధర్ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. శుక్రవారం అమలాపురం శ్రీదేవి మార్కెట్ సెంటర్లో శ్రీదేవి అమ్మవారికి శ్రీబాలాత్రిపురసుందరీదేవిగా ఆకుల వెంకటేశ్వరరావు-వెంకటలక్ష్మి దంపతులు విశేష అలంకరణ జరిపించారు. గంధం శ్రీనివాసరెడ్డి, నల్లా రామారావు, ఎం.బ్రహ్మాజీ ఆధ్వర్యంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. భళ్లమూడి దివాకర శాస్త్రి ఆధ్వర్యంలో బి.శ్రీనివాససిద్ధాంతి అమ్మవారికి విశేష పూజాభిషేకాలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మెయిన్‌రోడ్డులోని శ్రీవాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని వైష్ణవి కనకదుర్గమ్మ శ్రీ బాలాత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ కార్య నిర్వహణాధికారి దూనబోయిన సాయిబాబు ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. పెద్దింటి సత్యవెంకట అనంతకృష్ణసాయిదీక్షితులు అమ్మవారికి విశేష అలంకరణ జరిపించారు.

లలితా సహస్రనామ పారాయణం

అంతర్వేది, అక్టోబరు 4: సఖినేటిపల్లి మండలంలోని కనకదుర్గమ్మ ఆలయాల వద్ద భక్తులు అర్చనలు జరిపించుకున్నారు. తొలుత అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి కుంకుమ పూజలు చేశారు. అంతర్వేది సైకిల్‌షాపు సెంటర్‌లో శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో భక్తులు లలితా సహస్రనామ పారాయణం చేశారు. కేశవదాసుపాలెం, మోరి, మోరిపోడు, టేకిశెట్టిపాలెం, సఖినేటిపల్లిలంక, సఖినేటిపల్లి, గొంది, రామేశ్వరం గ్రామాల్లో అమ్మవారి ఆలయాల వద్ద కోలాట భజనలు, భక్తి గీతాలాపనలు నిర్వహించారు.

అన్నపూర్ణగా అలంకరించి ప్రత్యేక పూజలు

ఆలమూరు, అక్టోబరు 4: ఆలమూరు గ్రామదేవత రావులమ్మతో పాటు మండలంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లను అన్నపూర్ణగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

సాముహిక కుంకుమ పూజలు

రావులపాలెం, అక్టోబరు 4: ఈతకోట కనకదుర్గమ్మ ఆలయం, రావులపాలెం కాలువగట్టు చెంతన గల అమ్మవారి ఆలయంలో శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

అమ్మవారికి గోదావరి జలాలతో అభిషేకం

అల్లవరం, అక్టోబరు 4: బెండమూర్లంకలో విజయదుర్గ అమ్మవారిని గోదావరి జలాలతో అభిషేకించారు. తొలుత మహిళలు 108 కలశాలతో వైనతేయ నదీ జలాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. గిడుగు భాస్కరరావు పర్యవేక్షణలో వేదపండితుడు గౌరీశంకర్ జలాభిషేకం, కుంకుమ పూజలు జరిపారు. అల్లవరం దుర్గాదేవి ఆలయంలో మంగళంపల్లి పాండురంగ విఠల్ ఆధ్వర్యంలో అమ్మవారికి లక్ష్మీగణపతి, రుద్ర, చండీ, నక్షత్ర మృత్యుంజయ హోమాలు జరిగాయి. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, యాళ్ల వెంకటానందం, బుర్రిలంక వెంకటకృష్ణ, బండిగుప్తాపు పాండురంగ, సుంకర శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆలయాల్లో కుంకుమ పూజలు

ఆత్రేయపురం, అక్టోబరు4: మండలంలోని పలు అమ్మవార్ల ఆలయాల్లో కుంకుమ పూజలు, లలితాసహస్రనామ పారాయణను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాడపల్లి విజయదుర్గాదేవి ఆలయంలో భవానీ దీక్షాపరులు ప్రత్యేక పూజలు చేశారు. ఉచ్చిలిలో విజయదుర్గాదేవిగాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్ల ఆలయాల్లో మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు చేశారు.

బ్రాహ్మచారిణి అలంకరణలో దర్శనం

యానాం, అక్టోబరు4: యానాం శివారు గిరియాంపేట రోడ్డులోని శ్రీపాల కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఆలయ అర్చకులు రాయప్రోలు కామేశ్వరశర్మ ఆధ్వరంలో అమ్మవారికి సాముహిక కుంకమ పూజలు నిర్వహించారు. అమ్మవారు బాలాత్రిపురసుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పడవలరేవు వీధిలోని లలితాదేవి ఆలయంలో అమ్మవారు కౌమారిదేవిగా, గోపాల్‌నగర్‌లోని శారదాదేవి (సరస్వతి) ఆలయంలో అమ్మవారు బ్రాహ్మాచారిణి అలంకరణలో, శివాలయం ప్రాంగణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు బాలాత్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

గాయత్రి దేవిగా దర్శనం

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 4: శుక్రవారం పార్కువద్ద కనకదుర్గ ఆలయం, కొత్తూరు జోడు తూముల వద్ద కనకదుర్గ ఆలయం, జ్ఞానసరస్వతి ఆలయాల్లో కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

గాయత్రీ దేవికి పూజలు

రాయవరం, అక్టోబరు 4: వెదురుపాక విజయదుర్గా అమ్మవారు శుక్రవారం వేదమాత గాయత్రిదేవిగా పూజలందుకుంది. తొలుత విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. గాడ్ కుమార్తె సత్య వెంకట కామేశ్వరి అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులకు అమ్మవారి కుంకుమ, ప్రసాదం, తీర్థం అందజేశారు. అనంతరం మహిళలు అమ్మవారికి గాయత్రి అష్టోత్తరాలతో సామూహిక శ్రీచక్ర అర్చనలు చేశారు. పీఠానికి వచ్చిన భక్తులనుద్దేశించి పీఠాధిపతి గాడ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. వేద మాత గాయత్రిదేవిని పూజిస్తే కలిగే శుభాలను వివరించారు. పీఠంలో ఆధ్యాత్మికవేత్త ఆచార్య శలాక రఘునాదశర్మ దుర్గాదేవి అవతారాలపై చేసిన ఆధ్యాత్మిక ప్రసంగం ఆకట్టుకుంది. అమ్మవార్ని ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐవో నరసింహారావు దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీబాపిరాజు, విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, పీఠం పీఆర్వో బాబీ, గాదే కృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

బాలా త్రిపురసుందరి దేవిగా దర్శనం

ముమ్మిడివరం, అక్టోబరు 4: శుక్రవారం ముమ్మిడివరం ఈశ్వరమ్మవారి ఆలయంలో శ్రీవిజయదుర్గమ్మ బాలాత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు. విళ్ల ఈశ్వరరావు, విళ్ల గణేష్‌ల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు జరిపించారు. గోదశివారిపాలెంలోని విజయదుర్గమ్మను పలు రకాల పండ్లతో అలంకరించారు. సోమిదేవరపాలెంలోని అమ్మవారికి ఓ భక్తుడు వెండి శఠగోపాన్ని కానుకగా అందించారు.

కుంకుమార్చన, చండీ హోమం

మామిడికుదురు, అక్టోబరు 4: శుక్రవారం మండలంలో పలుచోట్ల అమ్మవారికి కుంకుమార్చన పూజలు ఘనంగా చేశారు. మగటపల్లిలోని గాయత్రీ త్రిశక్తి పీఠంలో కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు. పెదపట్నంలంక కనకదుర్గమ్మ శుక్రవారం బ్రాహ్మచారిణి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మామిడికుదురు, పాశర్లపూడి, అప్పనపల్లి, పెదపట్నం తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు శుక్రవారం భక్తులతో పోటెత్తాయి.

శ్రీపెద్దమ్మ తల్లికి పూజలు

మండపేట, అక్టోబరు 4:మండపేటఏడిద రోడ్డులో ఉన్న శ్రీపెద్దమ్మ తల్లి ఆలయం వద్ద ఆలయ ట్రస్టీ వాలిన వీరబాబు సారధ్యంలో శుక్రవారం రాత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు, భవానీలు అమ్మవారిన్ని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. శుక్రవారం రాత్రి అమ్మ వారికి కుంకుమ పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

బహిరంగ సభకు మాలలంతా తరలిరావాలి

ముమ్మిడివరం, అక్టోబరు4: కాకినాడ అంబేడ్కర్ భవనంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల12న నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభకు మాలలంతా తరలిరావాలని మహాసేన రాజేష్ పిలుపునిచ్చారు. ముమ్మిడివరం నగర పంచాయతీ అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో గొల్లపల్లి గోపీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సభలో మహాసేన రాజేష్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని ప్రకటించిన మందకృష్ణ మాదిగ ప్రధాని మోదీ ద్వారా ఎస్సీ వర్గీకరణ తీర్పు వచ్చేలా చేశారని, ఇదిపూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. మెండి కమల, కాశి మూర్తి, కాశి లాజర్, బూరుగ కల్యాణ్, కొండేటి వెంకటలక్ష్మి, భీమవరపు దుర్గబాబు, మోర్త వర్మ, కొంకి శ్రీనివాసరావు, మధుర రాంబాబు, సుందరయ్య, గెడ్డం శ్రీను, గుర్రాల రాంబాబు, జనిపల్లి సత్యనారాయణ, నేరేడుమిల్లి అబ్బులు, గంటి బుజ్జి, జల్లి శేఖర్, గెడ్డం శ్రీరామ్, కృష్ణమూర్తి, గెద్దాడ శ్రీనివాసరావు, కాట్రు వెంకట్, మోర్త సురేష్ పాల్గొన్నారు.

అంబాజీపేట: ఎస్సీ వర్గీకరణ, ఎస్సీల మతస్వేచ్ఛ అనే అంశాలపై కాకినాడ ఈనెల12న ఏర్పాటుచేసిన సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని మహాసేన రాజేష్ కోరారు. మండలానికి వచ్చిన ఆయనకు ముక్కామల నుంచి ఘనస్వాగతం పలికారు. పుల్లేటికుర్రు, అంబాజీపేటలలోని అంబేడ్కర్ విగ్రహాలకు ఆయన నివాళులర్పించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సర్పంచ్ జల్లి బాలరాజు, నాయకులు చిన్నం బాలవిజయరావు,నూకపెయ్యి చిన్న, ఎస్ఎస్ఎన్ వర్మ, నాగవరపు నాగరాజు, కత్తుల బాబులు, చింతపల్లి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా చండీ హోమం

ఐ.పోలవరం, అక్టోబరు 4: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో దాతల సహకారంతో శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు జరిగాయి. ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ పెన్మెత్స వాసురాజు దంపతుల ఆధ్వర్యంలో హోమం జరిగింది.

ఓఎన్జీసీ రిగ్గ్ వద్ద ధర్నా

అంబాజీపేట, అక్టోబరు 4: కె.పెదపూడి శివాలయం వీధిలో ఉన్న ఓఎన్జీసీ రిగ్గు వద్ద స్థానికులు, మహిళలు ధర్నా నిర్వహించారు. రిగ్గు ఏర్పాటు సమయంలో రహదారికి ఇరువైపులా కొబ్బరిచెట్లనుతొలగించారు, పరిహారంఅందిస్తామని రైతులకు ఓఎన్జీసీ అధికారులు హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ పరిహారం చెల్లించకపోవడంతో శుక్రవారం స్థానికులు, మహిళలు నిరసన తెలిపారు. రిగ్గు పనులు పూర్తికావడంతో ఇక్కడ నుంచి మిషన్లు, సామగ్రి లారీల్లో తరలిస్తుండగా స్థానికులు లారీలను అడ్డుకున్నారు. దీంతో ఎస్ఐ కె.చిరంజీవి సిబ్బందితో అక్కడకు చేరుకుని స్థానికులు, మహిళలతో చర్చించారు. దీనిపై ఎస్ఐ చిరంజీవి ఓఎన్జీసీ అధికారులతో చర్చించారు. తొలగించిన కొబ్బరిచెట్ల సొయాన్ని రైతుల ఖాతాలకు రెండురోజుల్లో జమ చేస్తామని ఓఎన్జీసీ అధికారులు హామీ ఇచ్చారు. దీంతో పోలీసులు ఆ ప్రాంతంలో కొబ్బరి చెట్ల నష్టపోయిన వారినుంచి వివరాలు సేకరించారు. ఆ వివరాలను రాజమహేంద్రవరం ఓఎన్జీసీ అధికారులకు పంపించారు.

జాతీయస్థాయిలో తాటిపాక వేద విద్యార్థినికి మెడల్



రాజోలు, అక్టోబరు 4: జాతీయ స్థాయిలో అస్సాంలో జరిగిన తైక్వాండో పోటీల్లో తాటిపాక వేద జూనియర్ కళాశాల విద్యార్థిని యెరుబండి శశిరేఖ బ్రాంజ్ మెడల్ సాధించిందని వేద విద్యా సంస్థల కార్యదర్శి ఏవీఎస్ఎస్ రవికుమార్ శుక్రవారం తెలిపారు. వీటితో పాటు తూర్పుగోదావరి స్థాయిలో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ద్వారా స్కూలు గేమ్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించిందని తెలిపారు. ఈసందర్భంగా జరిగిన అభినందన సభలో విజేత శశిరేఖను కార్యదర్శి రవికుమార్, నాన్ ఎకో డైరెక్టర్ కె.సూర్యనారాయణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.సోమేశ్వరరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.బాపన్న, ఏవో రామరాజు అభినందించారు.

మందేశ్వర ఆలయ ఈవోగా చక్రధరరావు



కొత్తపేట, అక్టోబరు 4: మందపల్లి మందేశ్వర (శనేశ్వర) స్వామి ఆలయ సహాయ కమిషనరు, ఈవోగా నల్లం సూర్యచక్రధరరావు బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను పలువురు అభినందించారు. ఇక్కడ పనిచేసిన కె.విజయలక్ష్మి బదిలీపై కాకినాడ వెళ్లారు.

నేడు, రేపు బస్‌పాస్‌ల జారీ నిలుపుదల

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 4: బస్సుపాస్‌ల జారీలో నూతన సాంకేతిక పద్ధతులు ప్రవేశపెడుతున్నందున సీజన్ టిక్కెట్లు, బస్‌పాస్‌లు ఈనెల5,6 తేదీల్లో ఇవ్వడంలేదని డిపోమేనేజరు తెలిపారు. ఈనెల7 నుంచి యథావిధిగా పాస్‌లు జారీ చేస్తామన్నారు.

రాజోలు: ప్రయాణికులకు, విద్యార్థులకు ఏపీఎస్ ఆర్టీసీ బస్‌పాస్ వెబ్‌సైట్ ఆధునికీకరణ చేస్తున్నందున ఈనెల5,6 తేదీల్లో బస్‌పాస్‌లు ఇవ్వటం లేదని రాజోలు ఆర్టీసీ డీఎం పి.భాస్కరరావు శుక్రవారం తెలిపారు. ఈనెల7నుంచి యథావిధిగా బస్‌పాస్‌లు ఇస్తామన్నారు.

కార్యకర్తలే టీడీపీకి బలం: బండారు

కొత్తపేట, అక్టోబరు4: కార్యకర్తలే టీడీపీ బలమని, పార్టీ విజయం కోసం కృషి చేసిన కార్యకర్తలందరికీ అండగా ఉంటామని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని బండారు బుల్లిసత్యం కాపు కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు, తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, యువ నాయకుడు బండారు సంజీవ్ పాల్గొన్నారు. సత్యానందరావు మాట్లాడుతూ కూటమి విజయానికి కారకులైన కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. బూసి జయలక్ష్మీభాస్కరరావు, ధర్నాల రామకృష్ణ, యల్లమిల్లి జగన్మోహన్, పల్లి భీమారావు, రెడ్డి రామకృష్ణ, బీర ఇసాక్, వాసంశెట్టి సత్యనారాయణ, కముజు గంగాధర్, సత్తిరాజు ఉషారాణి, చింతం విజయకృష్ణమోహన్, మిద్దే ఆదినారాయణ, సిద్ధంశెట్టి సత్యనారాయణ, గుబ్బల మూర్తి, రెడ్డి శ్రీనివాస్, కముజు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత మండపేటను చేద్దాం



మండపేట, అక్టోబరు 4: మండపేటను ప్లాస్టిక్ రహిత పట్టణంగా మారుద్దామని, అందుకు పట్టణ ప్రజలంతా సహకరించాలని మండపేట మున్సిపల్ కమిషనర్ టి.వి. రంగారావు పిలుపు నిచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మెప్మా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో వున్న 40 మంది మెప్మాకు చెందిన ఆర్‌పీలు తడి, పొడి చెత్త సేకరణలో భాగస్వామ్యులు కావాలని కోరారు. వారికి తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్లు విక్రయించినా, వినియోగించినా చర్యలు తప్పవన్నారు. శుభకార్యాలు, పండుగల సందర్భంగా జరిగే కార్యక్రమాల్లో ప్లాస్టిక్ గ్లాసులు వాడితే చర్యలు తీకుంటామన్నారు. సమావేశంలో ఆర్‌పీలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.కమిషనర్ రంగారావు ఆదేశాలతో మండపేట పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా ఇబ్బ ముబ్బడిగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను రెండు రోజుల నుంచి పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది తొలగిస్తున్నారు.

లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలి

అంబాజీపేట, అక్టోబరు 4: మండలంలో లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని కోకోఫెడ్ ఛైర్మన్ అరిగెల బలరామమూర్తి సీఎండీకి శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎలక్ట్రికల్ ఉపకరణాలు సరిగా పనిచేయడం లేదన్నారు.

ప్లాస్టిక్ తయారీ విధానం పరిశీలన

మలికిపురం, అక్టోబరు 4: తూర్పుపాలెంలో ఉన్న ఉమా ఇండస్ట్రీస్ ప్లాస్టిక్ ఫ్యాక్టరీని శుక్రవారం కలెక్టర్ మహేష్‌కుమార్ పరిశీలించారు. నిర్వాహకులు అడబాల ప్రభాకర్, బాబాజీలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముడిసరుకు సేకరణ, తయారీ, ఎగుమతి తదితర అంశాల గురించి అడిగారు. మానే గరుడ, బాబాజీలు కలెక్టర్‌కు ఫ్యాక్టరీకి సంబంధించిన విషయాలు వివరించారు. కలెక్టర్ వెంట డీపీవో రాంబాబు, ఇన్‌చార్జి తహసీల్దార్ సీఎస్‌రాజు, సర్పంచ్ జి.సత్తిబాబు, యెనుముల నాగు, అడబాల సాయిబాబు, సుందర బ్రహ్మయ్య, రాజోలు ఉప ఎంపీపీ యింటిపల్లి ఆనందరాజు ఉన్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం



యానాం, అక్టోబరు 4: యానాం శ్రీభూసమేత వెంకటేశ్వరస్వామి బాల ఆలయంలో ద్వివింశతి (22వ) బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ అధికారులు, దాతల సహకారంతో పది రోజులు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. శుక్రవారం ఉదయం 10.16గంటలకు స్వామివారి సన్నిధిలో కరకుదురుకు చెందిన వాడపల్లి గోపాలాచార్యుల నేతృత్వంలో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ప్రతి రోజూ ఆరాధానోత్సవాలు, ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాలు, నిర్వహిస్తారు. ఉత్సవాలకు ఆలయ ఈవో ఖండవల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో ఉత్సవదారులు ఏర్పాట్లు చేశారు. తొలిరోజు ఆలయంలో గరుడత్త బ్రాహ్మణసేవా సమితి ఉత్సవదారుల ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర కార్యక్రమానలు నిర్వహించారు.

కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తా



ఆత్రేయపురం, అక్టోబరు 4: పార్టీకి కష్టకాలంలో అండగా ఉండి కష్టపడిన ప్రతి కార్యకర్తకు పూర్తిగా న్యాయం చేస్తామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆత్రేయపురంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. సెంట్రల్ డెల్టాకు ఆయువుపట్టుగా ఉన్న లొల్ల లాకులు పునర్నిర్మాణానికి రూ.76కోట్లతో ప్రతిపాదనలు రూపొందించామన్నారు. రూ.36 కోట్లతో బొబ్బర్లంక ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టగా కాటన్ బ్యారేజీ రహదారి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. రాజవరం-పొదలాడ రహదారిని అభివృద్ధి చేస్తామన్నారు. వాడపల్లి వెంకన్న ఆలయానికి వెళ్ళే భక్తుల కోసం బైపాస్ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించామన్నారు. సమావేశంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, యువ నాయకుడు బండారు సంజీవ్, క్లస్టర్ ఇన్‌చార్జిలు ముళ్ళపూడి భాస్కరరావు, కరుటూరి నరసింహరావు, కాయల జగన్నాథం, తోటకూర సుబ్బరాజు, దుగ్గిరాల సుబ్బలక్ష్మి, మద్దూరి సుబ్బారావు, పాలంగి రవిచంద్ర, కుదప కృష్ణమూర్తి, మెర్ల రాము పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి వినతి



అమలాపురం టౌన్, అక్టోబరు 4: అమలాపురం ఏరియా ఆసుపత్రిని జిల్లా స్థాయిలో పూర్తిగా అభివృద్ధి చేయాలని కోరుతూ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శుక్రవారం అమరావతిలో వైద్య ఆరోగ్య శాఖ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యంతో ఏరియా ఆసుపత్రి మూడవ అంతస్తులో 40గదులకు తాళాలు వేశారని, వాటిని పునః ప్రారంభించేలా చర్యలు తీసుకుని వైద్య సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించాలని ఆనందరావు కోరారు. అనంతరం ఆయన మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్‌ను కలిసి అమలాపురం పురపాలక సంఘంలో నెలకొన్న ప్రధాన సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

ఆలమూరు, అక్టోబరు4: మండలంలో నలుగురు పంచాయతీ కార్యదర్శులు బదిలీకాగా ముగ్గురిని కొత్తగా నియమించారు. ఇద్దరిని మండలంలోనే బదిలీచేశారు. ఆలమూరు, చొప్పెల్ల, చింతలూరు, చెముడులంక పంచాయతీ కార్యదర్శులు కె.సంజీవ్‌రెడ్డి, ఎం.శ్యామ్‌సుందర్, సీహెచ్ వీరవెంకటరెడ్డి, యు.రేణుక బదిలీపై వెళ్లగా సీహెచ్ వీరమాత జొన్నాడ నుంచి మూలస్థానం అగ్రహారం, కె.మోక్షాంజలి మెదుకూరు నుంచి ఆలమూరు బదిలీ అయ్యారు. కె.సాయిప్రసాద్‌ను మోదుకూరు, బి.వెంకటరత్నాన్ని మడికి, సీహెచ్ సుబాష్‌ను జొన్నాడ కార్యదర్శులుగా నియమించారు.

12న అశోక విజయదశమి వేడుకలు

అమలాపురం టౌన్, అక్టోబరు 4: అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో ఈనెల12న అశోక విజయదశమి వేడుకలు నిర్వహించనున్నట్లు వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన బౌద్ధ భిక్షువులు హాజరవుతారని చెప్పారు. శుక్రవారం బుద్ధవిహార్ వద్ద ఛైర్మన్ నాగాబత్తుల ప్రసాదరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. డిసెంబరు 6న బుద్ధవిహార్ 26వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు తీర్మానించారు. సభ్యులు గోసంగి ఆనందరావు, కాశి రాంబోధి, ములపర్తి సత్యనారాయణ, కాశి వెంకట్రావు, జల్లి రంగారావు తదితరులు పాల్గొన్నారు. తొలుత అనారోగ్యంతో ఆసుపత్రిలో వైద్యం చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు డీబీ లోక్‌ను గొల్లపల్లితో పాటు పలువురు పరామర్శించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: శ్వాగ్
శ్రీలలిత	: సెలబ్రిటి
శేఖర్ స్క్రీన్-1	: రామనగర్ బన్నీ
శేఖర్ స్క్రీన్-2	: దక్షిణ
రమా	: దేవర-1
గణపతి	: మత్తువదలరా-2
వెంకటపద్మావతిస్క్రీన్-1	: దేవర-1
వెంకటపద్మావతి స్క్రీన్-2	: సత్యంసుందరం

దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధి శిక్షణకు రేపు ఎంపికలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు4: రామచంద్రపురం నియోజకవర్గంలో విభిన్న ప్రతిభావంతులైన వారికి ఉద్యోగాలు ఎంపికకోసం శిక్షణ ఇచ్చేందుకు ఈనెల6న వీఎస్ఎం కళాశాలలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు మంత్రి సుభాష్ తెలిపారు. 18నుంచి 35ఏళ్ల ఇంటర్, బీటెక్, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. వికాస, సార్థక సంస్థల ఆధ్వర్యంలో ఎంపికలు జరిపి 45నుంచి 60రోజులు శిక్షణ ఇచ్చి, ఉద్యోగం కల్పిస్తామన్నారు.

మహిళా ఉపాధ్యాయుల భద్రత ముఖ్యం

అంతర్వేది, అక్టోబరు 4: రాష్ట్ర వ్యాప్తంగా మహిళా ఉపాధ్యాయులు ఎక్కువగా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నందున, జాగ్రత్త వహిస్తూ భద్రతా చర్యలు తీసుకోవాలని సఖినేటిపల్లి ఎంఈవో బి.కిశోర్‌కుమార్ అన్నారు. ప్రధానంగా హెల్మెట్ ధరించాలని, స్పీడ్ 30 నుంచి 35 కిలోమీటర్లు దాటకుండా వాహనాలు నడపాలన్నారు. వాహనాన్ని నడిపేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడ కూడదన్నారు. కేశవదాసుపాలెం హెచ్ఎం సీహెచ్ సుజాత ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఎంఈవోలు కిశోర్‌కుమార్, వెంకటేశ్వరరావులు రోడ్డు భద్రతపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

రాష్ట్ర లిడ్‌క్యాప్ చైర్మన్‌గా మాణిక్యరావు

అయినవిల్లి,అక్టోబరు4: రాష్ట్ర లిడ్ క్యాప్ (లెదర్ టెక్నాలజీ అభివృద్ధి సంస్థ) ఛైర్మన్‌గా పిల్లి మాణిక్యరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను తాడేపల్లిలోని లిడ్ క్యాప్ కార్యాలయంలో శుక్రవారం పలువురు పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో సత్కరించారు. టీడీపీ హెచ్‌ఆర్డీ రాష్ట్ర సభ్యుడు నేదునూరి వీర్రాజు, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి కముజు శ్రీనివాసరావు, కొమ్ము నారాయుడు, పిప్పర సత్యానంద బాబాజీ, సవరపు శ్రీనివాస్ అభినందించారు.

6న మాలమహానాడు సర్వసభ్య సమావేశం

కె.గంగవరం, అక్టోబరు 4: మాల మహానాడు మండల సర్వసభ్య సమావేశం ఈనెల6వ తేదీన (ఆదివారం) నిర్వహించనున్నట్లు మండల కార్యవర్గం ప్రకటించింది. కె.గంగవరంలో శుక్రవారం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆదివారం జరిగే సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. ఆది వారం మధ్యాహ్నం మూడు గంటలకు కె.గంగవరం గ్రామ పంచాయతీ ఆవ రణలో జరిగే సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి మాల మహానాడు సభ్యులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో మాల మహా నాడు మండల కార్యవర్గ సభ్యులు కోటి వెంకట్రావు, తరపట్ల ఆనం దరావు, రవ్వా భూషణం, పెట్టా శ్రీనివాసరావు, ఈరెళ్ళరాజు, అన్నవరం, బత్తుల అప్పారావు, ఎం.చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక హామీని అమలు చేయాలి

అమలాపురంటౌన్, అక్టోబరు 4: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని తక్షణం అమలు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు గుదే దుర్గాప్రసాద్, నూకల బలరామ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నా ఉచిత ఇసుక హామీని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. అనంతరం వినతిపత్రాన్ని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు అందజేశారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ... ఈనెల15 నుంచి జిల్లాలో 12రీచ్‌లను ఓపెన్ చేస్తున్నామని, ప్రజలందరికీ ఇసుకను అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ధర్నాలో జిల్లా కమిటీ సభ్యులు పీతల రామచంద్రరావు, టి.నాగవరలక్ష్మి, తాడి శ్రీరామమూర్తి, కె.శంకర్, వి.మోహనరావు, పొలమూరి శ్రీనివాసరావు, బళ్ల పర్వతాలు, దున్నాల శ్రీను, పట్టా గోవిందు పాల్గొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో ఆరు నెలలు జైలు

ముమ్మిడివరం, అక్టోబరు 4: చెక్ బౌన్స్ కేసులో ఓ వ్యక్తికి ఆరు నెలలు జైలు శిక్ష పడింది. ముమ్మిడివరం నగర పంచాయతీ చిప్పలపాలేనికి గ్రామానికి చెందిన సరిపెల్ల చినవీరవెంకటసత్యనారాయణరాజు వద్ద 2019 డిసెంబరు 10న కొమానపల్లికి చెందిన కోలా వెంకటేశ్వరరావు రూ.4.50లక్షలు అప్పుగా తీసుకుని చెక్కును ఇచ్చాడు. చెక్కు చెల్లనిదిగా బ్యాంకు నిర్ధారించడంతో బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. ముమ్మిడివరం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ మహ్మద్ రహ్మతుల్లా నిందితుడు రాజుకు 6నెలలు జైలు శిక్ష, రూ.4.50లక్షలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

సీఎం సహాయనిధికి రూ.3లక్షలు అందజేత



రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 4: విజయవాడ వరదబాధితుల కోసం మోడరన్ కళాశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఇతరులు సమకూర్చిన, మోడరన్ ఫౌండేషన్ విరాళం రూ.3లక్షలు సీఎం సహాయనిధికి అందజేశారు. విజయవాడలో సీఎం చంద్రబాబుకు మోడరన్ అధినేత లయన్ జి.వి.రావు, అకడమిక్ డైరెక్టరు రమాదేవి రూ.3లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్ ఉన్నారు.

సెక్రటరీ కోటయ్యకు ఘన సన్మానం



రాజోలు, అక్టోబరు 4: శివకోటి గ్రామ సెక్రటరీ కోటయ్య కృష్ణా జిల్లా గుడివాడ మండలం మల్లయ్యపాలెం పంచాయతీకి బదిలీ అయ్యారు. శివకోటి పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నక్కా రామారావు అధ్యక్షతన శుక్రవారం సెక్రటరీ కోటయ్యను దుశ్శాలువా కప్పి పూలమాలలతో నాయకులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ రామారావు మాట్లాడుతూ సెక్రటరీగా కోటయ్య ప్రజల నుంచి మంచి మన్నలు పొందారని కొనియాడారు. చాగంటి స్వామి, ఆరుమిల్లి భానుసుధాకర్, కసుకుర్తి త్రినాథస్వామి, పినిశెట్టి బుజ్జి, ఎంపీటీసీలు ఉంద్రు సూర్యారావు, బొడ్డు కృష్ణారావు, సీనియర్ టీడీపీ నాయకుడు మెరుగుముప్వల సత్యవరప్రసాద్, కడలి కపిల్, బంగారం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు నివారించాలి

మలికిపురం, అక్టోబరు 4: విద్యుత్ కోతలు నివారించాలని శుక్రవారం మలికిపురం సబ్‌స్టేషన్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ధర్నాను ఉద్దేశించి సీపీఐ నాయకుడు దేవ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ట్రూఅప్ తదితర పేర్లతో మరో రూ.8100కోట్ల అదనపు విద్యుత్ భారాన్ని ప్రజలపై వేసే ఆలోచన విరమించుకోవాలన్నారు. మలికిపురం సెంటర్ నుంచి సబ్‌స్టేషన్ వరకు ప్రదర్శనగా వెళ్లి అక్కడ ధర్నా నిర్వహించారు. సీపీఐ నాయకులు పిచ్చుక గంగాధర్, చెల్లుబోయిన తాతారావు, కొండా సత్తిబాబు, మేడిచర్ల సత్యనారాయణ, పుల్లెల ఆనంద్, వై.వెంకట్ పాల్గొన్నారు.

అధ్యాపకుల సమ్మెను శాసనమండలిలో ప్రస్తావిస్తా

మలికిపురం, అక్టోబరు4: జీతాలు చెల్లించాలని కోరుతూ మలికిపురం డిగ్రీ కళాశాల అధ్యాపకులు చేస్తున్న సమ్మె 24వరోజుకు చేరింది. శిబిరాన్ని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ సందర్శించి సంఘీభావం తెలిపారు. సమ్మె విషయం శాసనమండలిలో ప్రస్తావిస్తానన్నారు. సమ్మె శిబిరాన్ని లక్కవరం మంగెన గుర్రయ్య కళాశాల అధ్యాపక బృందం సందర్శించి సంఘీభావం తెలిపారు. చవ్వాకుల సూర్యప్రకాశరావు, గెడ్డం పేర్రాజు, నల్లి శివకుమార్, సీహెచ్‌సూర్యప్రకాశరావు, గుబ్బల సత్యనారాయణ పాల్గొన్నారు.

తిరుమల ఆలయ ప్రతిష్టను కాపాడాలి

రావులపాలెం, అక్టోబరు4: తిరుమలప్రతిష్టను కాపాడాలనిరావులపాలెంలో బీజేపీ రాష్ట్రనాయకుడు, గుంటూరుజిల్లా ఇన్‌చార్జి తమలంపూడి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీనిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పలు మార్గాల ద్వారా కోనసీమ ముఖద్వారం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. వ్యాపారవేత్త చిన్నం చంద్రారెడ్డి, నాయకులు కేవీ కృష్ణారెడ్డి, ఎస్.సుబ్బరాజు, ఎస్.స్వామి, ఎం.కృష్ణ, జి.వెంకటేశ్వరరావు, కె.చిన్నారి పాల్గొన్నారు.

పిచ్చి కుక్క స్వైరవిహారం

ముగ్గురు మహిళలకు తీవ్రగాయాలు, ఇద్దరికి స్వల్ప గాయాలు



కుక్కకాటుతో గాయపడ్డ యార్లగడ్డ గన్నమ్మ, శాంతమ్మ

రావులపాలెం, అక్టోబరు 4: దేవరపల్లి శివారు రాజుగారిదొడ్డి సమీపంలో ఒక పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. కనిపించిన వారిని కనిపించినట్టుగా దొరికన చోట కరిచింది. యార్లగడ్డ గన్నమ్మ, కొనుకుమట్ల శాంతమ్మ, చిట్టూరి జ్యోతిలకు తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయలయ్యాయి. వారు కొత్తపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పిచ్చికుక్క దాడితో ప్రజలు హడలిపోతున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మామిడికుదురు, అక్టోబరు 4: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. మామిడికుదురు 216 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మలికిపురం మండలం గొల్లపాలేనికి చెందిన కొంబత్తుల శ్రీనివాసరావు(36) అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీనివాసరావు క్రేన్ కొనుక్కుని జీవనోపాధి పొందుతున్నాడు. అతడు శుక్రవారం క్రేన్ విడి భాగాలను కొత్తపేట మండలం పలివెలలో కొనుగోలుచేసి తిరిగి వస్తుండగా మామిడికుదురులో గుర్తుతెలియని కారు వెనుకనుంచి ఢీకొట్టింది. అక్కడికక్కడే అతడు మృతిచెందాడు. అతడికి భార్య రాణికుమారి, ఐదేళ్ల కుమార్తె నవ్యశ్రీ, నాలుగేళ్ల కుమారుడు జశ్విత్ ఉన్నారు. నగరంఎస్ఐ ఎ.చైతన్యకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలు కొబ్బరికాయల చోరీ

కాట్రేనికోన, అక్టోబరు 4: ప్రభుత్వానికి చెందిన కొబ్బరి కాయలను పట్టపగలే అధికార పార్టీ నాయకులు దొంగతనం చేశాడు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందింది. నడవపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ స్టోరేజ్ ట్యాంకు గట్టున 110 కొబ్బరి చెట్లు ఉన్నాయి. ఈచెట్ల కాయలను తీసుకునేందుకు రెండేళ్లకు ఒకసారి వేలం నిర్వహిస్తారు. రెండేళ్ల క్రితం రూ.90వేలకు వేలం జరిగింది. రెండు నెలల క్రితమే పాట వ్యవధి ముగిసింది. ఇంకా వేలం నిర్వహణ జరగలేదు. శుక్రవారం టీడీపీకి చెందిన మండల స్థాయి నాయకుడు, గ్రామస్థాయి నాయకుడు కలిసి పట్టపగలే కాయలు దింపు తీసి వాహనంలో తీసుకుపోయి అమ్ముకున్నారు. దీనిపై ఎంపీడీవో కేవీ చలంను వివరణ కోరగా ఈఅంశంపై జిల్లా ప్రజాపరిషత్ అధికారులకు నివేదించామన్నారు.

విలేకరులపై కేసు నమోదు

ఉప్పలగుప్తం/ముమ్మిడివరం, అక్టోబరు 4: తన ఇసుక లారీని అడ్డగించి సొమ్ము డిమాండ్ చేశారంటూ లారీ యజమాని రెడ్డి శ్రీనివాసరావు ఫిర్యాదుతో పోలీసులు ముగ్గురు విలేకరులపై శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ చలమల రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.... గురువారం రాత్రి పెదగాడవిల్లి నుంచి ముమ్మిడివరం వైపు వెళ్తున్న ఇసుక లారీని విలేకర్లమంటూ కొందరు అడ్డగించి సొమ్ము డిమాండ్ చేశారు. దీంతో మందపాటి వెంకటరమణ, చింతపల్లి జాన్‌రాజు, బొంతు వెంకటనాగశేఖర్‌లపై లారీ యజమాని రెడ్డి శ్రీనివాసరావు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. కాగా తనను లారీతో గుద్దించారంటూ లారీ యజమాని రెడ్డి శ్రీనివాసరావు, డ్రైవర్ ఓగూరి దుర్గాప్రసాద్‌లపై మందపాటి వెంకటరమణ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

ఉప్పలగుప్తం, అక్టోబరు 4: పెదగాడవిల్లి పంచాయతీ వల్లాయిచెరువులో శుక్రవారం పేకాడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3,440 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ చలమల రాజేష్ తెలిపారు.